సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం ⁝ 30 ⁝ జనవరి ⁝ 2023



'నీరు'పేద రైతుల హర్షం
మూడేళ్లుగా వరుణుడు కరుణించడంతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఎక్కడ చూసినా జలకళ తొణికిసలాడుతోంది.
- 8లో



అందం చూడవయా..
తాటిపూడి కాటేజీ కొత్త హంగులతో దర్శనమిస్తోంది. కాటేజీ ప్రాంతాన్ని ప్రభుత్వం అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది.
- 8లో



గరివిడిలో తైక్వాండో పోటీలు
గరివిడిలోని గోదావరిదేవి షరాఫ్ ఉన్నత పాఠశాలలో 15వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి.
- 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పార్వతీపురం టౌన్: అనకాపల్లిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికైనట్టు కోచ్ అనిల్‌శర్మ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ఆదివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి తొమ్మిది గోల్డ్, ఎనిమిది సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్‌ను సాధించినట్టు తెలిపారు. వీరు సోమవారం నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

మినీ జాబ్ మేళా రేపు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మినీ జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయభేరి ఆటో మొబైల్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డెంటోర్స్, టెక్నీషియన్ పోస్టులకు ఇంటర్మీడియెట్, ఐటీఐ డీజిల్ మెకానిక్, ఆటోమొబైల్స్‌లో డిగ్రీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి పార్వతీపురం, బొబ్బిలి, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గల యువతీ యువకులు పాల్గొనవచ్చునన్నారు. అపోలో ఫార్మసీ కంపెనీలో ఫార్మసిస్టు, రీటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలకు ఫార్మసీ సర్టిఫికెట్ పొందిన వారు, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరంలో ఉద్యోగం కల్పిస్తామన్నారు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాలు వయస్సు గల వారై ఉండాలన్నారు.

పోలిపల్లి పైడితల్లి జాతరకు ముహూర్తపు రాట



అమ్మవారి జాతరకు వేస్తున్న పందిరి రాట

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు ముహూర్తపు రాట ఆలయ ఆవరణలో ఆదివారం వేశారు. ఫిబ్రవరి 26 నుంచి మూడు రోజులపాటు జరగనున్న 97వ జాతరకు ఈ రాటతో పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ఈఓ బీవీ మాధవరావు, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 24న నేత్రోత్సవం జరిపిన అనంతరం ఫిబ్రవరి 26న జాతర ప్రారంభించి 28న ఘటోత్సవంతో ముగింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సలాది తులసీరావు, సలాది మహేశ్వరరావు, వాకచర్ల మన్మథరావు, వాకచర్ల పైడిరాజు, పెంకి చైతన్యకుమార్, ఆర్నెపల్లి వెంకటినాయుడు, అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి కమ్మసిగడాం జాతర




మహాలక్షుమ్మ అమ్మవారు

చీపురుపల్లి రూరల్: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కమ్మసిగడాం జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమై మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ జాతర మహోత్సవాల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనాన్ని అలరించనున్నాయి.

ఐఐఎంలో కలెక్టర్ ప్రసంగం

విజయనగరం అర్బన్: విశాఖపట్నంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదివారం ప్రసంగించారు. మహాత్మా గాంధీ నేషనల్ ఫెలోస్‌ను ఉద్దేశించి ఆమె స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా సిటిజెన్ చార్టర్ అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. ప్రభుత్వ శాఖల పనితీరు, కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల పాత్ర పరిశోధనా విద్యార్థుల పాత్ర, వారు దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాలను వాటి ప్రాధాన్యతను వివరించారు.

వృత్తిదారులకు అండగా చేదోడు



రాష్ట్రంలో చేతివృత్తిదారులకు అండగా ఉంటూ వారి వృత్తిలో రాణించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'చేదోడు'గా ఉంటోంది. ఏటా రూ.10వేల సాయం అందిస్తూ వృత్తిపరంగా అభివృద్ధి చెందేందుకు చేయూతనిస్తోంది. దీంతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో మూడవ విడత చేదోడు వివరాలు

వివరాలు	మొదటి విడత లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి(కోట్లలో)	రెండవ విడత లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి(కోట్లలో)	మూడవ విడత లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి(కోట్లలో)
రజకలు	2707	రూ.2.70	2523	రూ.2.52	3036	రూ.3.03
నాయీబ్రాహ్మణులు	1066	రూ.1.06	993	రూ.0.99	1150	రూ.1.15
టైలర్లు	3392	రూ.3.39	3330	రూ.3.33	4007	రూ.4.0

- ఏటా రూ.10వేల ఆర్థిక సాయం
- నేడు మూడో విడత అందజేత
- మూడో విడత 8193 మందికి రూ. 8.19 కోట్లు
- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు లబ్ధి

పార్వతీపురం టౌన్: చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వైఎస్సార్ చేదోడు పథకం కింద అందిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే రెండు విడతల సాయం అందించగా మూడో విడత లబ్ధిని నేడు సోమవారం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు లబ్ధిదారులతో దరఖాస్తు చేయించడంతో పాటు ఈకేవైసీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది పూర్తి చేశారు. జిల్లాలో గతేడాది కంటే ఈసారి లబ్ధిదారుల సంఖ్య పెరిగింది.

అదనంగా 1347 మందికి

వైఎస్సార్ చేదోడు పథకానికి సంబంధించి ఈ ఏడాది మూడో విడత సాయం కింద 8193 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో రెండో విడత లబ్ధిదారులు 6846 మంది ఉండగా కొత్తగా 1347 మందికి లబ్ధి అందించనున్నారు. వీరికి మొత్తంగా రూ.8.19 కోట్ల సాయం అందించనున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో 14,011 మందికి పథకం కింద రూ.14.01 కోట్లు అందింది. మొదటి విడతతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్య 1028 పెరిగింది.

వృత్తిదారులకు అండగా...

ప్రభుత్వం ఏటా ఇచ్చే రూ.10 వేలను రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వారి వృత్తికి సంబంధించిన వస్తువుల కొనుగోలు, షాపు అద్దెలు, విద్యుత్ బిల్లులకు ఉపయోగించుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందించడంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్ చేదోడుతో పాటు తమ కుటుంబాలకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, ఆసరా, రైతు భరోసా వంటి పథకాలు కూడా అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..



వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా రెండు విడతల్లో ఇప్పటికే రూ.20 వేలు అందుకున్నాను. మూడో విడత సాయం కోసం అవసరమైన పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేసి ఈకేవైసీ కూడా పూర్తి చేశాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉంది.
– గరుగుబిల్లి శంకర్రావు, టైలర్, జగన్నాథపురం

నేటి నుంచి ఖాతాల్లో జమ



వైఎస్సార్ చేదోడు పథకం మూడో విడత కింద జిల్లాలో 8193 మంది లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున అందించనున్నాం. ఈసారి కొత్తగా 1347 మంది లబ్ధిదారులు అర్హత సాధించారు. రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులకు మూడో విడత సాయాన్ని నేటి నుంచి వారి ఖాతాల్లో జమ చేస్తాం.
– ఆర్.గడెమ్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

నేడు మరియగిరి యాత్ర

- సహాయమాత ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక సర్వీసులు నడపనున్న ఆర్టీసీ



భక్తుల పూజలందుకుంటున్న మేరీమాత

వీరఘట్టం: వీరఘట్టంకు సమీపంలో యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మరియమ్మ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఏటా జనవరి 30న మరియగిరి యాత్ర ఆనవాయితీగా జరుగుతోంది. కుల, మతాలకు అతీతంగా భక్తులు వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. గత రెండేళ్లుగా కరోనా ప్రభావంతో భక్తుల తాకిడి తగ్గింది. అందుచే ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున గతంలో కంటే వైభవంగా మహోత్సవాన్ని జరిపేందుకు మరియగిరి ఉత్సవ కమిటీ ఫాదర్ చల్లా డేవిడ్ ఏర్పాట్లు చేశారు. భక్తులు మరియమ్మను దర్శించుకొనేందుకు వీలుగా కొండపైన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయకుమార్ ఆధ్వర్యంలో జరగనున్న దివ్య పూజకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టెంట్‌లు, షామియానాలు ఏర్పాటు చేసారు. యాత్రా ప్రాంగణంలో ప్రత్యేక స్టాళ్లు పెట్టారు.

30 ఏళ్లుగా...

పూర్వకాలం నుంచి మరియగిరి యాత్ర ఇక్కడ జరిగేది. గత 30 ఏళ్ల నుంచి శ్రీకాకుళం మేత్రాసనం ఆధ్వర్యంలో మరియగిరి యాత్ర జరుగుతోంది. ఈ ఏడాది మరియగిరి యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి పలు చర్చిల ఫాదర్‌లు, మఠకన్యలు హాజరై ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

70 మంది పోలీస్ సిబ్బంది

మరియగిరి యాత్రకు పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో 70 మంది పోలీస్ సిబ్బంది నియమిస్తున్నట్లు సీఐ మురళీధర్ తెలిపారు. వీరఘట్టం ఎస్‌ఐ ఎం.హరికృష్ణ ఆదివారం మరియగిరి ప్రాంగణాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బృందాలను నియమించారు. వాహనదారులు, ముఖ్యంగా ఆటోలు నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలుపుదల చేయాలని కోరారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మరియగిరి యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి రానున్నారు. వీరి కోసం పార్వతీపురం, పాలకొండ, శ్రీకాకుళం ఆర్టీసి డిపోల నుంచి ప్రతి 15 నిమిషాలకు మరియగిరి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు తెలిపారు. సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మరియగిరి వద్ద ప్రత్యేక ఆర్టీసీ కంట్రోల్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ద్వారపూడిని సందర్శించిన కేంద్ర బృందం



గ్రామంలో ఎస్‌బ్ల్యూపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామాన్ని ఇద్దరు సభ్యుల కేంద్ర బృందం (రైకార్) ఆదివారం సందర్శించింది. సన్‌సద్ ఆదర్శ గ్రామ యోజనలో గతంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా జాతీయ బృంద సభ్యులు గిరిజా శంకర్ పాడి, సత్యరంజన్ రౌత్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో పింఛన్‌దారులు, ఉపాధి హామీ వేతనదారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, 2015లో పీఎంఈజీవై పథకంలో మంజూరైన ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామంలో సీసీ రోడ్లు, గ్రంథాలయం, రక్షిత తాగునీటి పథకాన్ని పరిశీలించారు. సోలార్ పంపుహౌస్ పరిశీలించగా, మరమ్మతులకు గురైందని అధికారులు తెలపగా, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌డబ్ల్యూపీ కేంద్ర నిర్వహణ, ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, సర్పంచ్ ఆదిలక్ష్మి, వైస్ సర్పంచ్ వెన్ను శ్రీనివాసరావు, పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నవశకంలో మార్పులకు అవకాశం



రేషన్‌కార్డులో మార్పులకు కుడ్డపల్లి సచివాలయంలో దరఖాస్తు ఇస్తున్న లబ్ధిదారుడు

- గ్రామ, వార్డు సచివాలయాల్లోనే...
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికే..
- ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

☛ సీతంపేట ఏజెన్సీలోని కుడ్డపల్లి పంచాయతీ పెదకంబకు చెందిన నిమ్మక వీరయ్య, కుమారుడు గోపాలరావు, కోడలు భవాని ఒకే కుటుంబంగా నవశకం సర్వేలో నమోదయ్యారు. భవానికి కురుపాంలో గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. దీంతో వీరయ్యకు పింఛన్ ఆగింది. అలాగే రేషన్‌కార్డు తీసివేశారు. ఇలా సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయాయి. దీంతో తగిన ఆధారాలతో రేషన్ కార్డులో పేరు మార్పుల కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు.

☛ మొగదార గ్రామానికి చెందిన ఆరిక అప్పమ్మ, ఆమె కుమారుడు, కోడలు భాగ్యలక్ష్మి తదితరులు నవశకం సర్వేలో ఒకే కుటుంబంగా నమోదయ్యారు. కోడలకు టీచర్ ఉద్యోగం రావడంతో అప్పమ్మకు పింఛన్ నిలిచిపోయింది. పెదరామకు చెందిన కె.దుర్గమ్మదీ ఇదే పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది ఉన్నారు. వీరందరికీ ఇప్పుడు నవశకంలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది.

సీతంపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వలంటీర్లతో నవశకం సర్వే చేయించింది. టీడీపీ హయాంలో జరిగిన ప్రజా సాధికార సర్వేను ఆధారంగా చేసుకుని వివరాలు పరిశీలించేలా చూశారు. పరిశీలనలో కొంత మందికి సంక్షేమ పథకాలు అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లోనే నవశకం డేటాలో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఇదీ పరిస్థితి

ప్రస్తుతం రెండు, మూడు కుటుంబాలు కూడా హౌస్‌హోల్డ్ సర్వే మ్యాపింగ్‌లో ఒకటిగా ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో నాలుగైదు కుటుంబాలు కూడా ఉన్న సందర్భాలున్నాయి. ఆయా కుటుంబాల్లో ఎవరో ఒకరు ఆదాయ పన్ను చెల్లించినా, భూమి ఎక్కువగా ఉన్నా, కారు ఉన్నా, 1000 చదరపు గజాల స్థలం ఉన్నా మిగతా కుటుంబాలకు సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుతం భార్యాభర్తలను ఒక కుటుంబంగా పరిగణించి విభజన చేస్తారు. సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌లో ఏ కుటుంబమైతే అనర్హులుగా తేలుతుందో వారికి సంక్షేమ పథకాలు వర్తించవు. మిగిలిన కుటుంబాలకు ప్రభుత్వ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటారు. ఈ క్రమంలో రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఇక్కడ కూడా భార్య, భర్తను ఒక జంటగా పరిగణిస్తారు. తల్లిదండ్రులు ఉంటే వారిని ఒక కుటుంబంగా విభజిస్తారు. విడాకులు తీసుకున్న వారిని వేర్వేరుగా పరిగణిస్తారు. వితంతువులు, భార్యను కోల్పోయిన వారు, ఒంటరిగా ఉంటున్న వారికి రేషన్ కార్డులు ఇస్తారు. చనిపోయిన వారి పేర్లను తొలగించడంతో పాటు కొత్తగా పెళ్లయిన వారిని జంటగా పరిగణించి నూతన రేషన్‌కార్డు ఇస్తారు. పెళ్లయిన ఆడ పిల్లలను భర్త కుటుంబంలో చేర్చుతారు.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

నవశకం సర్వే డేటాలోని కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకోదలిచిన వారు ఎదో ఒక ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. పెళ్లయిన వారు మ్యారేజ్ సర్టిఫికెట్ చూపించాలి. ఆధార్, బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పథకాలు ఆగిపోతున్నాయని పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడం జరిగింది. ఆయన వెంటనే స్పందించారు. చక్కని అవకాశం కల్పించారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆ సమస్యలు లేకుండా ఇప్పుడు గ్రామ సచివాలయాల్లో సరి చేసుకోవాలి.
– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

బిత్రపాడులో గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంట పొలాల్లో ఏడు గజరాజులు సంచరిస్తున్నాయి. ఆదివారం ఉదయం ఏనుగుల గుంపు రావడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ప్రస్తుతం అరటి, కూరగాయల పంట చేతికందిన సమయంలో గజరాజులు రావడంతో ఎక్కువగా నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇంటికే లంచ్ బాక్స్



సబ్బవేట అంగన్‌వాడీ కేంద్రంలో కుటుంబ సభ్యుల ద్వారా భోజనాన్ని ఇంటికి పంపుతున్న కార్యకర్త

ఆరోగ్యవంతమైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. అయితే కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి మరింత ప్రాధాన్యత ఇస్తూ పౌష్టికాహారాన్ని వారి ఇంటికే లంచ్ బాక్స్‌లో పంపుతోంది.

- పౌష్టికాహార లోపం నిర్మూలనకు ప్రభుత్వం తాజా నిర్ణయం
- అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు ఊరట

భోగాపురం: మాతాశిశు మరణాలను నియంత్రించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని ఇంటి వద్దకే అందించేలా ఆదేశాలు జారీ చేసింది.

లంచ్‌బాక్స్‌తో ఊరట

జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 9,455 మంది గర్భిణులు, 11,116 బాలింతలు, 46,400 మంది చిన్నారులకు రోజూ మధ్యాహ్నం భోజనం, కోడిగుడ్లు, పాలుతో పాటు అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇది వరకూ గర్భిణులు, బాలింతలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి మధ్యాహ్నం భోజనం చేయాలనే నిబంధన ఉండేది. వివిధ కారణాలతో చాలా మంది గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనానికి రాలేపోతు న్నారు. దీంతో వారు పౌష్టికాహారానికి దూరం కావ డం వల్ల రక్తహీనత సమస్యతో ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం లంచ్‌బాక్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు వారి కుటుంబ సభ్యుల ద్వారా వారి ఇంటి వద్దకే మధ్యాహ్న భోజనం అందిస్తోంది. ఈ నిర్ణయం చాలా మందికి ఊరట కలిగిస్తోంది.

ఊరట

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం, ఆకుకూరలు, పప్పుతో చేసిన వంటకాలను అందిస్తున్నాం. రోజు వారి మెనూ తప్పనిసరిగా అమలు చేస్తున్నాం. అయితే కేంద్రాలకు దూరంగా ఉన్న వారు, రాలేని పరిస్థితి ఉన్న వారు మధ్యాహ్నం భోజనానికి గైర్హాజరవుతున్నారు. అందరికీ పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభు త్వం లంచ్‌బాక్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దీంతో వారి ఇళ్లకే మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నాం. అవకాశమున్న వారు తప్పనిసరిగా కేంద్రానికి రావాలని సూచిస్తున్నాం.
– బి.శాంతకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

ప్రాజెక్టుల వారీగా కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతల సంఖ్య

ప్రాజెక్టు	గర్భిణులు	బాలింతలు	లంచ్‌బాక్స్ అందిస్తున్న వారి సంఖ్య
బాడంగి	458	566	219
భోగాపురం	1,136	1,144	388
బొబ్బిలి(రూరల్)	297	377	104
బొబ్బిలి(అర్బన్)	333	334	87
చీపురుపల్లి	914	1,063	330
గజపతినగరం	635	828	258
గంట్యాడ	975	1,150	423
నెల్లిమర్ల	751	839	250
రాజాం	940	1,378	242
శృంగవరపుకోట	614	746	159
వియ్యంపేట	867	909	294
విజయనగరం(అర్బన్)	074	1,118	240
సాలూరు(ఆర్ పురం)	250	330	107
వీరఘట్టం	211	274	29
మొత్తం	9,455	11,116	3,128

క్లుప్తంగా

కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న కుక్కల దాడిలో గాయపడిన బాధితులు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో వీధి కుక్కలు గ్రామస్తులపై దాడి చేయడంతో ముగ్గురు తీవ్ర గాయాల పాలు కాగా మరి కొంతమందికి స్వల్పంగా గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గోగాడ సతీష్, పేకేటి పైడిరాజు, పాశల అచ్చియ్యమ్మలు తీవ్రంగా గాయపడడంతో వారిని గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. స్వల్పంగా గాయపడిన వారు స్థానికంగా చికిత్స పొందారు.

ఆటోలోంచి జారిపడి వ్యక్తి మృతి



చిన్నకృష్ణ మృతదేహం

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు చిన్నకృష్ణ(52) ఆటోలో ప్రయాణిస్తుండగా జారిపడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్సై జె.తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోటలో ఓ ఫంక్షన్‌కు హాజరైన చిన్నకృష్ణ తిరిగి ధర్మవరం వెళ్తుండగా మారుతీనగర్ వద్ద ప్లైవుడ్ పరిశ్రమ ఎదురుగా ఆటోలో నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. స్థానికులు హుటాహుటిన ఎస్‌కోట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

బొబ్బిలి: మండలంలోని పారాది సమీపంలో మలుపు వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన బండి రమేష్‌ను అదే జిల్లా పాచిపెంట మండలం మోసూరుకు చెందిన లండా సింహాచలాన్ని ద్విచక్రవాహనంపై దిగబెడుతుండగా బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కింద పడి తీవ్రగాయాలపాలయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్సై జి.భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

వాటర్ ట్యాంకుపైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



వీర నారాయణస్వామి మృతదేహం

బొండపల్లి: మద్యం తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని నచ్చచెప్పాలని ప్రయత్నించిన భార్య మాటలు భర్తను మనస్తాపానికి గురి చేశాయి. దీంతో వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బొండపల్లి మండలంలోని గొల్లుపాలెంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం, కైకరం గ్రామానికి చెందిన దార్ల వీర నారాయణస్వామి (37) బతుకు దెరువు కోసం గొల్లుపాలెం గ్రామానికి వచ్చి కార్పెంటర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వెళ్లి అక్కడ పనులు చేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడు. తిరిగి గొల్లుపాలెం వచ్చిన నారాయణ స్వామి ఇక్కడ పని చేయకుండా మద్యం తాగుతూ కాలక్షేపం చేస్తున్నాడు. మద్యం తాగవద్దని రెండు రోజుల క్రితం భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద గల వాటర్ ట్యాంకు పైకి ఎక్కి దూకేశాడు. పై నుంచి దూకడంతో తీవ్ర గాయాల పాలైన నారాయణ స్వామిని గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు 12 ఏళ్ల, 8 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930–00
బంగారం(22కి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

నీరుపేద రైతుల హర్షం

- పాతాళ గంగ పదిలం
- విస్తారంగా వర్షాలతో నిలకడగా భూగర్భ జలమట్టం
- రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు
- సాగునీటికి ఢోకా లేకపోవడంతో అన్నదాతల్లో ఆనందం



బోర్ల ద్వారా పంట పొలాల్లోకి భూగర్భజలాలు



పార్వతీపురం టౌన్: మూడేళ్లుగా వరుణుడు కరుణించడంతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఎక్కడ చూసినా జలకళ తొణికిసలాడుతోంది. వాగులు, వంకలు, నదుల్లో నీరు పారుతోంది. రిజర్వాయర్లలో పుష్కలంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కూడా నాగావళి నీటిని కాలువల ద్వారా జిల్లాలోని రైతులకు అందజేసింది. వర్షరూపంలో వచ్చే ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పడుతూ భూమిలో ఇంకేలా చేస్తోంది. దీంతో భూగర్భజలమట్టం పైపైకి ఎగబాకింది. ఫలితంగా ఈ వేసవిలో తాగు, సాగునీటి ఇబ్బందులకు ఆస్కారమే ఉండదని అధికారులు చెబుతున్నారు. వరుణుడు కరుణిస్తుండడంతో పాతాళగంగ పదిలంగా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1166.2 మి.మీకు గాను 28 శాతం అధికంగా 1322.6 మి.మీ మేర వర్ష పాతం నమోదు కావడంతో భూగర్భజలాలు బాగా పెరిగాయి. గడిచిన పదేళ్ల చరిత్ర తిరగేస్తే జనవరి నెలలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే తొలిసారి. జిల్లా వ్యాప్తంగా ఉన్న బోరు బావుల నుంచి నీరు సమృద్ధిగా వస్తుండడంతో వ్యవసాయ, ఉద్యాన రైతులు సాఫీగా సేద్యం పనులు చేసుకుంటున్నారు. రైతులు, కూలీలకు చేతినిండా పనులు ఉండడంతో వలస వెళ్లే దుస్థితి దూరమైంది. మూడేళ్లుగా భారీ వర్షాలు ముంచెత్తుతుండటంతో జిల్లాలోని 15 మండలాలు సేఫ్ జోన్‌లో ఉన్నాయి.

జిల్లాలో మండలాల వారీగా సగటున నీటిమట్టం

మండలం	నీటి మట్టం (మీటర్లలో)
పాలకొండ	5.31
బలిజిపేట	0.89
భామిని	6.91
జీఎల్‌పురం	10.73
గరుగుబిల్లి	11.03
జియమ్మవలస	5.61
కొమరాడ	4.96
కురుపాం	3.67
మక్కువ	4.5
పాచిపెంట	14.83
పార్వతీపురం	6.26
సాలూరు	45.12
సీతంపేట	8.58
సీతానగరం	5.65
వీరఘట్టం	6.67

గతమంతా కష్టాలే

ఒకసారి వెనక్కి చూస్తే 2014–18 మధ్య కాలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నీళ్లు రాక జిల్లాలోని వందలాది బోర్లు ఎండిపోయాయి. భూగర్భ జల మట్టం సగటున 30 నుంచి 35 మీటర్లకు పడిపోయింది. పనుల్లేక ఏటా లక్షల సంఖ్యలో రైతులు, కూలీలు, పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కానీ..మూడేళ్ల నుంచి పరిస్థితి మారింది. విస్తారంగా వర్షాలు పడుతుండడంతో 'పార్వతీపురం మన్యం' జిల్లా జలకళను సంతరించు కుంది. వరి, కంది, మొక్కజొన్నతో పాటు ఉద్యాన తోటలు, కూరగాయల పంటల విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. పశుపోషణ, పాడి అభివృద్ధికి ఢోకా లేకుండా పోవడంతో రైతుల నుంచి హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

జిల్లాలో వర్షపాతం వివరాలు

ఏడాది సగటు వర్షపాతం	1166.02 మి.మీ
ఇప్పటి వరకూ కురిసిన వర్షపాతం	1322.6 మి.మీ
వర్షం రూపంలో ప్రవహించిన నీరు	61 టీఎంసీలు
భూమిలో ఇంకిన నీరు	15 టీఎంసీలు
జిల్లా తాజాసగటు నీటి మట్టం	5.162 మీ
సేఫ్‌జోన్‌లో ఉన్న మండలాలు	15

వేసవిలో ఇబ్బంది ఉండదు



భూగర్భజలాలు మెరుగ్గా ఉండడంతో రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కూడా ఇబ్బంది ఉండదు. సాధారణంగా వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యేది. కానీ మూడేళ్లుగా వేసవిలో ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. నాగావళి నీటిని కాలువల ద్వారా జిల్లాలోని రైతులకు అందజేయడమే కాకుండా వర్షాల ద్వారా చెరువులు నిండడంతో జిల్లా వ్యాప్తంగా నీటి లభ్యత గణనీయంగా పెరిగింది. – ఎ. రాజశేఖర్, జిల్లా భూగర్భజలశాఖ అధికారి, పార్వతీపురం మన్యం



సరికొత్తగా దర్శనమిస్తున్న కాటేజీ



తాటిపూడి జలాశయం

అందం చూడవయా.. ఆనందించవయా..!



కాటేజీ అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



కాటేజీ వద్ద ఏర్పాటు చేసిన పెయింటింగ్

- తాటిపూడి కాటేజీకి కొత్త హంగులు
- అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం
- పర్యాటకులు ఉండేలా ఏసీ ,నాన్ ఏసీ గదుల ఆధునికీకరణ
- అందమైన పెయింటింగ్ ఏర్పాటు

గంట్యాడ: తాటిపూడి కాటేజీ కొత్త హంగులతో దర్శనమిస్తోంది. కాటేజీ ప్రాంతాన్ని ప్రభుత్వం అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. పర్యాటకులను ఆకర్షించే విధంగా ఆధునికీకరించారు. పచ్చని కొండలు, ఆ కొండల నడుమ నిండుకుండలాంటి జలాశయంతో తాటిపూడి కాటేజీ ప్రాంతం అత్యంత ఆహ్లాదకరంగా, ప్రశాంతమైన వాతావరణంలో పర్యాటకులను ఆకర్షిస్తోంది.

ఆధునికీకరించిన ప్రభుత్వం

తాటిపూడి అందాలను చూడడానికి వచ్చే పర్యాటకులు కాటేజీలో ఒకటి రెండు రోజులు ఉంటారు. ప్రస్తుతం ప్రభుత్వం గదులను, కాటేజీ ప్రాంతాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. పర్యాటకులు ఉండే గదులతో పాటు పరిసర ప్రాంతాన్ని ఆధునీకరించారు. అలాగే పర్యాటకులను ఆకర్షించేందుకు అందమైన పెయింటింగ్‌లు, విగ్రహాలను ఏర్పాటు చేశారు. పర్యాటకులు కూర్చుని వీక్షించేప్రాంతాన్ని టైల్స్‌తో ఆధునీకరించారు.

అందుబాటులో: అన్ని రకాల ఫుడ్ ఐటమ్స్

తాటిపూడి పర్యాటక ప్రాంతాన్ని వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ తోపాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అన్ని ప్రాంతాల పర్యాటలకులకు అనువుగా ఉండే ఫుడ్ ఐటమ్స్‌ను అందుబాటులో ఉంచారు. అదేవిధంగా తాటిపూడి చేపల కూర ఇక్కడి ప్రత్యేకత. కాటేజీ ప్రాంతం అందంగా దర్శన మిస్తుండడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

రుచికరమైన వంటలు



కాటేజీ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. పర్యాటకులను ఆకర్షించేందుకు పెయింటింగ్స్, విగ్రహాలు ఏర్పాటు చేశా. సొంతచెఫ్‌తో పర్యాటకులకు రుచికరమైన వంటలను అందిస్తున్నాం. కాటేజీ ప్రాంతానికి వచ్చే రహదారి కూడా బాగు చేయించాం. పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు.
– చుక్క శేషు, గిరివినాయక ఈకో టూరిజం మేనేజర్

సాయి సంస్థలకు రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును అందిస్తున్న తెన్నేటి పార్వతి

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా గల సత్యసాయి సేవా సమితి మందిర అభివృద్ధికి పాలకొండకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయురాలు ముక్కవెల్లి తెన్నేటి పార్వతి రూ.1లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సమన్వయకర్త ఆర్.కిశోర్, కన్వీనర్ కర్రా సుధాకరరావులకు విరాళం చెక్కును అందించారు. ఇప్పటికే దాత, విశ్రాంతి ఉపాధ్యాయురాలు సాయి మందిరం ద్వారా నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలకు రూ.పది లక్షలు విరాళాలు విడతల వారిగా అందించారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద రాంబాబు, కె.స్వరాజ్యం, సీహెచ్.శ్రీనివాస్, గేదెల శ్రీరాములు పాల్గొన్నారు.

గరివిడిలో తైక్వాండో పోటీలు



పోటీల్లో విజేతలుగా నిలిచిన గోదావరి దేవి షరాఫ్ పాఠశాల విద్యార్థులు



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సెక్రటరీ, స్కూల్ యాజమాన్యం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలోని గోదావరిదేవి షరాఫ్ ఉన్నత పాఠశాలలో 15వ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా తైక్వాండో సెక్రటరీ సీహెచ్.వేణుగోపాలరావు, శ్రీకాకుళం జిల్లా కోచ్ భాస్కరరావుల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 15 క్లబ్బుల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, క్యాడెట్, గోదావరిదేవి షరాఫ్ స్కూల్‌కు చెందిన ఎం.ఇషిత, ఎ.శ్రీచందన, ఎం.ప్రశాంతి, డి.నిశికీర్తన బంగారు పతకాలు, మరో ఆరుగురు విద్యార్థులు సిల్వర్, 20మంది కాంస్య పతకాలు గెలుచుకున్నరు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పంపిస్తామని ఈ సందర్భంగా తైక్వాండో సెక్రటరీ వేణుగోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాం విద్యాపీఠ్ ప్రతినిధులు టి.కమలాకరరావు, బి.రవి, మజ్జి భాస్కరరావు, జయ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా అవధాన వాణీవిలాసం



అవధాన వాణీవిలాసం నిర్వహిస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గాయత్రి భవన్‌లో ఆదివారం సాయంత్రం తిరుపతికి చెందిన అవధాన బాల భాస్కర శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ నేతృత్వంలో అవధాన వాణీ విలాసం పేరుతో నిర్వహించిన అష్టావధానం ఆద్యంతం రసవత్తరంగా సాగింది. ప్రాశ్నిక పరిషత్‌లో చంధోభాషణాన్ని బెంగళూరుకు చెందిన భైరవభట్ల కామేశ్వరరావు, నిషిద్ధాక్షరిని డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, దత్తపదిని పార్వతీపురానికి చెందిన డాక్టర్ ఎస్.హరిచందన్, వర్ణనను డాక్టర్ పి.శిరీషా రఘురామ్‌లు నిర్వహించగా, న్యస్తాక్షరిని దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, అశువును డాక్టర్ జక్కు రామకృష్ణ, అప్రస్తుత ప్రసంగాన్ని బీహెచ్‌కే.బాబూజీలు ప్రసంగించారు. కార్యక్రమానికి విజయభావన అధ్యక్షుడు దేవరాజు గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రామనారాయణం ట్రస్టీ నారాయణం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. విజయభావన ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు సభా సంచాలకుడిగా వ్యవహరించారు.

గడ్డికుప్పలు దగ్ధం



అల్లువాడలో దగ్ధమవుతున్న వరిగడ్డి కుప్ప



కాలిపోయిన నగదు పరిశీలిస్తున్న వీఆర్‌వో రవికుమార్ తదితరులు

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రైతుల గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా గడ్డి కుప్పల నుంచి మంటలు రావడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వారంతా వచ్చేలోగానే పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే గడ్డి కుప్పల పక్కనే ఉన్న ధాన్యం కుప్పలకు మంటలు అంటుకోకుండా రైతులంతా కలిసి మంటలను అదుపు చేశారు. సర్పంచ్ బొంగు పరిశినాయుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపల 60 ఎకరాల వరిగడ్డి దగ్ధమైపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ధాన్యం కుప్పలకు నిప్పు అంటకపోవడంతో నష్టం నుంచి బయటపడ్డామని రైతులు చెప్పారు.

నాలుగు పూరిళ్లు..

సీతంపేట: మండలంలోని కోడిశ పంచాయతీ మల్లమ్మగూడలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షా 50 వేల నష్టం వాటిల్లి ఉంటుందని రెవెన్యూ అధికారుల అంచనా. బిల్లగూడ కాలనీ, బిల్లగూడ, బొర్రవలసకు చెందిన నాలుగు కుటుంబాలు మల్లమ్మగూడ వద్ద పూరిళ్లు కట్టుకుని నివసిస్తూ పరిసరాల్లో కొండపోడు పంటలు పండించుకుంటున్నారు. అందరూ కొండపోడు పనులకు వెళ్లిపోయారు. కాగా దృష్టిలోపం ఉన్న వృద్ధురాలు వంటచేస్తుండగా మంటలు ఎగసి ఇంటికి నిప్పంటుకుంది. దీంతో పక్కనే ఉన్న సవర భారతి, సవర రామన్న, మంగయ్య, ముఖలింగానికి చెందిన ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. బియ్యం 225 కిలోలు కాలిపోయాయి. సవర రామన్నకు చెందిన రూ.30 వేలు, సవర మంగయ్యకు చెందిన రూ.11 వేల నగదు కాలిపోయాయి. అందరికీ సంబంధించిన పసుపు 50 కిలోలు, రాగులు, జొన్నలు 10 కిలోలు, ఇతర నిత్యావసర సరుకులు, వస్త్రాలు కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తికి సమాచారం అందడంతో వెంటనే వీఆర్‌వో రవికుమార్‌ను సంఘటనా స్థలానికి పంపించి నష్టం అంచనావేయించారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

యువకుడి మృతితో ఉద్రిక్తం

- ఆస్పత్రి, పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన



పోలీస్‌స్టేషన్‌వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

పాలకొండ: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా నడిచింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరపంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని కొండవీధికి చెదిన శ్రావణ్ కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి స్థానిక ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం పోలీసులు ఏర్పాట్లు చేశారు. దీనికి మృతుని కుటుంబసభ్యులు అంగీకరించలేదు. తమకు న్యాయం చేసే వరకు పోస్టు మార్టం చేయవద్దని ఆందోళనకు దిగి మృతుని కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ అంగీకరించక పోవడంతో మధ్యాహ్నం వరకు ఆస్పత్రి వద్ద ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో కమిషనర్ సర్వేశ్వరరావుతో డీఎస్పీ కృష్ణారావు మాట్లాడి మృతుని కుటుంబసభ్యుల్లో ఒకరికి తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగం కల్పించేందుకు అంగీకరింప చేశారు. అనంతరం మృతుని భార్య తరపువారు, తల్లి తరపు వారి మధ్య వివాదం రేగింది. ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం తమకు కావాలంటే, తమకు కావాలని పట్టుబట్టి వాదోపవాదాలకు దిగారు. ఆస్పత్రి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎస్సై శివప్రసాద్‌తో పాటు పోలీసులు ఎంత సర్ది చెప్పినా ఆందోళన విరమించలేదు. దీంతో డీఎస్పీ కృష్ణారావు చొరవ తీసుకు,ని ఇరువర్గాల వారికి నచ్చజెప్పి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సాయంత్రం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.